క్లుప్తంగా

పోలీసుల విస్తృత తనిఖీలు



డైమండ్ పార్కు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

సీతమ్మధార : ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కమీషన్ ఆదేశాల మేరకు డైమండ్ పార్కు వద్ద శుక్రవారం ఉదయం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. కార్లు, ఆటోలను క్షుణ్ణంగా తనిఖీ చేసి.. ఎక్కడి నుంచి వస్తున్నారు.. ఎక్కడికి వెళ్తున్నారని వాహన చోదకులను ప్రశ్నించారు. ప్రతి వాహనం నంబర్ రాసుకున్నారు. స్పెషల్ ఫోర్స్ పోలీసులు, లా అండ్ ఆర్డర్ ఏఎస్ఐతో పాటు సిబ్బంది తనిఖీల్లో పాల్గొన్నారు.

'నేను ప్రజాశాంతి పార్టీలోనే ఉన్నాను'



మీడియాతో మాట్లాడుతున్న బాబూమోహన్

సీతమ్మధార : తాను ప్రజాశాంతి పార్టీలోనే ఉన్నానని, బీఆర్ఎస్ టిక్కెట్ వచ్చి పార్టీ మారి పోయినట్లు తప్పుడు ప్రచారం జరుగుతుందని ప్రజాశాంతి పార్టీ నాయకుడు, వరంగల్ ఎంపీ అభ్యర్థి, సినీ నటుడు బాబూమోహన్ అన్నారు. ఆశీలమెట్టలోని కేఏ పాల్ ఫంక్షన్ హాల్లో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. తాను వరంగల్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని, బాబూమోహన్ తెల్ల కాగితం వంటివాడని అన్నారు. ఆ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పని చేస్తున్న తనను విశాఖ ఎంపీగా గెలిపించాలని కోరారు.

తూనిక యంత్రాల పరిశీలన



తూనిక యంత్రాన్ని పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ రామారావు

సీతంపేట: నరసింహనగర్ రైతుబజార్‌లో శుక్రవారం ఉదయం తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ వి.రామారావు అధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. కాటాలకు సీళ్ల ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ఆరు కాటాలకు సీళ్ల లేనట్టు గుర్తించి వాటికి సీళ్ల వేశారు. వినియోజదారులకు తూకంలో తేడా ఉన్నట్టు అనుమానాలు ఉంటే ధర్మకాటాలో తూకం వేసి సరిచూసుకోవాలని తెలిపారు. వినియోగదారులు తాము కొనుగోలు చేసిన కూరగాయలు ధర్మకాటాలో తూకం వేసి చూసుకున్నారు. కార్యక్రమంలో రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ చినబాబు, సహాయకుడు సర్య నారాయణ పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా వాహనాల రాకపోకలు



ఆశీలమెట్ట సిగ్నల్ పాయింట్ మధ్యలో నిలిపివేసిన స్కార్పియో కారు

సీతమ్మధార: నగరం నడిబొడ్డున ఉన్న ఆశీలమెట్ట సిగ్నల్ వద్ద వాహన చోదకులు ఇష్టారాజ్యంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ ట్రాఫిక్ పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. శుక్రవారం ఉదయం 11.30 గంటల సమయంలో ఆశీలమెట్ట జంక్షన్‌లోని రోడ్డు సెంటర్‌లో సిగ్నల్ పడకముందే స్కార్పియో కారును నిలిపివేయడంతో ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఆ సమయంలో ఒక్క ట్రాఫిక్ కానిస్టేబుల్ కూడా కనిపించకపోవడం విశేషం.



అన్నా నువ్వు గెలవాలి న్యాయం నిలవాలి : వాసుపల్లికి హారతులు ఇస్తున్న మహిళలు



మీ శ్రమను నేనవుతా : మహిళకు సాయంగా దోసెలు వేస్తున్న వాసుపల్లి



ఆత్మీయులు ఎక్కడుంటే అక్కడికే : ఇరుకు గల్లీలో వాసుపల్లి గణేష్‌కుమార్

ప్రజల పలకరింపులోనే.. కనిపిస్తున్న వాసుపల్లి గెలుపు

- 35వ వార్డులో జననీరాజనం నడుమ వాసుపల్లి ప్రచారం
- పూలు జల్లి.. శాలువాలు కప్పి ఆహ్వానం పలికిన స్థానికులు
- మదికి దగ్గరైన నాయకుడికి.. మనసైన ఆదరణ

ఓటు అడిగే ధైర్యం జగన్ అందించారు..

ప్రతి ఇంటికి వెళ్లి ధైర్యంగా ఓటు అడిగే హక్కు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాకిచ్చారు. దీనికి కారణం ప్రజలకు నిజమైన అభివృద్ధి అందించారు కనుక. దేశంలోనే ఎవరూ అందజేయనన్ని సంక్షేమ పథకాలు జగనన్న అందజేశారు. కార్పొరేట్ స్థాయిలో విద్య, వైద్యం, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసి పేదల బాంధవుడిగా జగనన్న కీర్తి గడించారు. జగన్ అంటే సంక్షేమం.. జగన్ అంటే అభివృద్ధి.

– వాసుపల్లి గణేష్‌కుమార్, దక్షిణం ఎమ్మెల్యే అభ్యర్థి



వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

జగదాంబ : దక్షిణలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ శుక్రవారం మూడో రోజు ఎన్నికల ప్రచారం కొనసాగించారు. స్థానికులను పలకరిస్తూ.. వృద్ధుల దీవెనలు అందుకుంటూ ఆయన జనంతో మమేకం అయ్యారు. ప్రచారం సందర్భంగా ప్రజలు ఆయనకు నీరాజనాలు పట్టారు. జీవీఎంసీ 35వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అలపన కనకరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల పరిశీలకులు ద్రోణంరాజు శ్రీవత్సవ్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడారు. తమ ముంగిటకు ఎమ్మెల్యే రావటం చూసిన ప్రజలు, మహిళలు మురిసిపోయారు. అడుగడుగునా ఆయనకు హారతులు పట్టారు. అభిమానం చాటుకుంటూ పూలు చల్లారు. పలు చోట్ల ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా వాసుపల్లి, శ్రీవత్సవ్ ఫ్యాన్ గుర్తు చూపిస్తూ మన పార్టీ గుర్తు ఇదేనని.. దీనికే ఓటు వేయాలని ప్రజలను కోరారు. అనంతరం ఎన్నికల పరిశీలకులు శ్రీవత్సవ్ మాట్లాడుతూ దక్షిణలో వాసుపల్లి గణేష్‌కుమార్ ప్రతి గడపకు సుపరిచితులన్నారు. ఎప్పుడూ ప్రజల మధ్య ఉండే వాసుపల్లిని వారు ఆదరిస్తున్న తీరు అద్భుతమన్నారు. ప్రతి కుటుంబం ఆయనను తమ పెద్ద కొడుకులా భావిస్తుందన్నారు. ఇటువంటి నాయకుడు దక్షిణ నియోజకవర్గానికి కచ్చితంగా కావాలన్నారు. ప్రజల పలకరింపులోనే వాసుపల్లి గెలుపు కనబడుతుందన్నారు. ఆయన గెలుపునకు అందరం కలిసి ఒక కుటుంబంలా కష్టపడి పని చేద్దామన్నారు. అనంతరం కల్లుపాకలు ప్రాంతంలో ప్రచారం జరిగింది. ఇక్కడ వాసుపల్లి గణేష్‌కుమార్ స్థానికులను ఆప్యాయంగా పలకరించారు. వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు సమస్యల గురించి ఏకరువు పెట్టగా.. అన్ని సమస్యలను పరిష్కరిస్తానని వారికి హామీ ఇచ్చారు. సుమారు అయిదు వేల గడపకు పైగా ఉన్న కల్లుపాకలు, గాజులవీధి ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది గంటల నుంచి ప్రచారం జరిగింది. దీంతో ఈ ప్రాంతంలో పండగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గరికిన గౌరి, వార్డు నాయకులు ఆదివిష్ణు రెడ్డి, సుబ్రహ్మణ్యం, గంగాధర్, పుష్ప, రమణమ్మ, గండిబోయిన రమణ, రూప, వార్డు నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలతో మమేకమై : ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలకు అభివాదం చేస్తున్న వాసుపల్లి

వైఎస్సార్‌సీపీలో చేరికలు



పార్టీలో చేరిన వారితో దక్షిణ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్



జనసేన నాయకులతో దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్

- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన దక్షిణ అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్ : దక్షిణ నియోజకవర్గంలో మత్స్యకారుల ఆశీర్వచనాలతో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తామని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఆశీల్‌మెట్ట అశోక్‌నగర్‌లో గల తన కార్యాలయంలో శుక్రవారం కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షురాలు కొల్లి సింహాచలం నేతృత్వంలో ఫిషింగ్ హార్బర్ వాటర్ సప్లై కమిటీకి చెందిన 30 మందికి పైగా సభ్యులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి వాసుపల్లి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణలో వార్ వన్‌సైడ్ జరుగుతుందన్నారు. జగనన్న ప్రభుత్వంలో మత్స్యకారుల కోసం ప్రత్యేకంగా ప్రజాదర్బార్ నిర్వహించామని గుర్తు చేశారు. రూ.152 కోట్ల పోర్టు నిధులతో ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి జరుగుతుందని వెల్లడించారు. గత ప్రభుత్వంలో నష్టపోయిన 37 బోట్లకు కేవలం రూ. 3 వేలు మాత్రమే నష్టపరిహారం అందజేశారన్నారు. జగనన్న ప్రభుత్వంలో 37 బోట్లకు రూ.కోటి 34 లక్షలు విడుదల చేయించామన్నారు. త్వరలో ఎన్నికల కమీషన్ అనుమతులు రాగానే నష్టపోయిన మత్స్యకారులకు సాయం అందజేస్తామన్నారు. పార్టీలో చేరిన వారిలో ఫిషింగ్ హార్బర్ వాటర్ సప్లై కమిటీ అధ్యక్షుడు జోగారావు, ఉపాధ్యక్షుడు పోలవరపు చంద్రరావు, కోశాధికారి మైలపల్లి పోలరాజు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ మహిళలు..

మహిళలకు గౌరవం ఇవ్వని టీడీపీని వీడి సముచిత స్థానం కల్పిస్తున్న వైఎస్సార్‌సీపీలో చేరినట్లు గాజులవీధి బూత్ కమిటీ మహిళలు వాసుపల్లి గణేష్‌కుమార్‌కు తెలిపారు. వాసుపల్లి కార్యాలయంలో శుక్రవారం మండల అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ నేతృత్వంలో వాసుపల్లి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు పదవుల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. డ్వాక్రా రుణ మాఫీ, మహిళలకు సంక్షేమ ఫలాలు అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. అందుకే ప్రచారంలో మహిళలు అడుగడుగునా హారతులు పడుతున్నారని చెప్పారు. మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. పార్టీలో 31, 35 కంబైన్డ్ వార్డు గాజులవీధి టీడీపీ బూత్ అధ్యక్షురాలు కె. రమ్య, జ్యోతి, కె. పద్మ, ఎస్‌పి కుమారి, భాను, సత్య, మాధురి, దుర్గాభవానీ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్న జనసేన నాయకులు

వైఎస్సార్‌సీపీలో శుక్రవారం జనసేన నాయకులు చేరారు. జీవీఎంసీ 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, వార్డు నాయకుడు నొల్లు పోతుస్వామి, ఆకుల యేసు, గనగల రామరాజు నేతృత్వంలో 50 మంది జనసేన నాయకులు వైఎస్సార్ సీపీలో చేరగా.. వీరికి దక్షిణ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీలో యువతకు అధిక ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకు రావాలన్నారు. పార్టీలో చేరిన వారిలో చింతపల్లి రాజేష్, కొరమాన సురేష్, కె.శ్యామ్, చింతపల్లి తాతాజీ, సీహెచ్ హరీష్, నొల్లు చంటి, కె అమర్‌నాథ్, సీహెచ్ సంతోష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రతిపక్షం లేని నియోజకవర్గంగా 'దక్షిణం'

జగదాంబ : ప్రతిపక్షం లేని నియోజకవర్గంగా దక్షణాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యమని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం జీవీఎంసీ 35వ వార్డులో వార్డు ఇన్‌చార్జి అలపన కనకరెడ్డి ఆధ్వర్యంలో కల్లుపాకలు ప్రాంతానికి చెందిన గండిబోయిన చిన్నా, టెంక్ దుర్గా కుటుంబాలు వాసుపల్లి గణేష్‌కుమార్, ఎన్నికల పరిశీలకుడు శ్రీవత్సవ్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న అందిస్తున్న సంక్షేమపాలన మునుపెన్నడూ చూడలేదన్నారు. సాయం అంటే క్షణాల్లో ముందుకొచ్చే వాసుపల్లిని ఎమ్మెల్యేగా గెలిపించుకోవడం లక్ష్యంగా పని చేస్తామని అన్నారు. పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ బూత్ కమిటీ మహిళా సభ్యులు



దుర్గకు పార్టీ కండువా కప్పుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్. చిత్రంలో శ్రీవత్సవ్



చిన్నాకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

కనకమహాలక్ష్మికి ఘనంగా క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

ఉపవాస దీక్ష.. క్రీస్తు నామమే రక్ష

- భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే
- చర్చిల్లో సామూహిక ప్రార్థనలు



ప్రార్థనా గీతాలు ఆలపిస్తున్న భక్తులు



పార్థనలో పాల్గొన్న జాన్‌వెస్లీ తదితరులు



కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



శిలువ మోస్తూ రక్షణ గిరికి చేరుకుంటున్న క్రైస్తవులు

అల్లిపురం : దక్షిణలోని పలు చర్చిల్లో క్రైస్తవులు గుడ్ ఫ్రైడే భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. క్రీస్తును స్తుతిస్తూ సామూహిక ప్రార్థనలు చేశారు. ఏసు మానవాళికి ఇచ్చిన సందేశాన్ని పాస్టర్లు చదివి వినిపించారు. అల్లిపురం మెయిన్‌రోడ్డులోని కల్వరి బాప్టిస్ట్ చర్చి, ఆంథోనీనగర్‌లో గల సెయింట్ ఆంథోనీ చర్చి, జగదాంబ దరి లండన్ చర్చితో పాటు కొబ్బరితోట, చలువతోట ప్రాంతాల్లో గల చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా రెవరెండ్ కె. వేదమణి శిలువపై ప్రభువు పలికిన మొదటి, ఐదవ మాటను, ఎం.జోసెఫ్‌రాజ్ రెండు, ఆరు మాటలను, జి.విజయరాజ్యం మూడవ మాటను, రెవరెండ్ జి.జాన్‌పీటర్ నాలుగు, ఏడవ మాటలను చదివి వినిపించారు. అంతకు ముందు చర్చి అధ్యక్షుడు రెవరెండ్ పీవీ ప్రసాద్ ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. గుడ్ ఫ్రైడే రోజు మానవజాతి పాపాలకు క్షమాపణ సూచిస్తుందని క్రైస్తవులు విశ్వసిస్తారు. ఈ కార్యక్రమంలో డి.రజనీకుమార్, బి.జాన్‌వెస్లీ పాల్గొని లేఖన భాగములను వినిపించగా అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు కీర్తనలు పాడి భక్తులను అలరించారు.

పునీతపేతురు ప్రధాన దేవాలయంలో..

కంచరపాలెం : సర్వమానవాళి పాప విమోచన కోసం ఏసు ప్రాణత్యాగం చేసిన రోజే పవిత్ర శుక్రవారం (గుడ్‌ఫ్రైడే) అని విశాఖ ఆర్చి బిషప్ రెవరెండ్ ఫాదర్ మల్లవరపు ప్రకాశ్ అన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం జ్ఞానాపురం పునీతపేతురు ప్రధాన దేవాలయంలో విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ నేతృత్వంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రక్షణగిరి భక్తులతో కిటకిటలాడింది. ఏసు నామాన్ని జపిస్తూ భక్తులు పులకించిపోయారు. క్రీస్తు త్యాగాన్ని కీర్తిస్తూ, సర్వజన రక్షణ కోరుతూ కన్నీటితో ప్రార్థనలు చేశారు. శిలువ యాత్రకు జనం పోటెత్తారు. రక్షణ సభ గురువులు, పీపీసీ సభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో విశాఖ ఆర్చి బిషప్ (అతిమేత్రానులు) ఫాదర్ మల్లవరపు ప్రకాశ్, రెవరెండ్ ఫాదర్లు శిలువను మోసుకుంటూ వేలాది మంది భక్తులతో కలిసి రక్షణ గిరిపైకి చేరుకున్నారు. క్రీస్తు మరణం, శిలువ మార్గం–క్రీస్తు వేదన, శ్రమలను సూచిస్తూ ఏర్పాటు చేసిన 14 స్థలాల వద్ద ప్రార్థిస్తూ ప్రదక్షిణ చేశారు. విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ సందేశాన్ని అందించారు. ప్రధాన దేవాలయం వద్ద బైబిల్ పఠనం, దివ్యపూజ బలులు, సామూహిక ప్రార్థనలు చేశారు. సాయంత్రం 5 గంటలకు ఉపవాస దీక్షాపరులు రక్షణగిరిపై దీక్ష విరమించారు. కార్యక్రమంలో ఫాదర్లు వేళంగిణిరాజు, ప్రభాకర్, ప్యారిస్ పాస్టిల్ కౌన్సిల్ (పీపీసీ) అధ్యక్షుడు శ్రీముసురు రాజేష్‌బాబు, పాలమరశెట్టి ఫ్రాన్సిస్, మీసాల స్వర్ణలత, వేల సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

ట్యాంకర్‌ని ఢీకొన్న కారు

- వైభవ్ జ్యుయలర్స్ ఉద్యోగి మృతి
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు




మృతుడు శివకుమార్

యలమంచిలి రూరల్: మండలంలోని పులపర్తి కూడలి సమీపంలో జాతీయరహదారిపై శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. జాతీయ రహదారిపై ఆగి ఉన్న ట్యాంకర్‌ను వెనుక నుంచి కారు ఢీకొన్న ప్రమాదంలో విశాఖపట్నం వైభవ్ జ్యుయలర్స్ మెయిన్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న మైలపల్లి వెంకట శివకుమార్(45) మృతి చెందాడు. అదే సంస్థ ఉద్యోగి బి.వి.ఎస్.కృష్ణ, కారు డ్రైవర్ కొండగొర్రి మల్లు దొర కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. సంస్థ పని నిమిత్తం వీరు భీమవరం వెళ్లారు. అక్కడి నుంచి గురువారం రాత్రి విశాఖకు కారులో తిరుగు ప్రయాణమయ్యారు. శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో వీరు ప్రయాణిస్తున్న కారు యలమంచిలి మండలం పులపర్తి వద్ద రోడ్డుపై నిలిపిన ట్యాంకర్‌ను ఢీకొంది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే హైవే అంబులెన్సులో క్షతగాత్రులను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ వెంకట శివకుమార్ మృతి చెందగా, గాయపడిన ఇద్దరిని మెరుగైన చికిత్స నిమిత్తం షీలానగర్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వీరిలో కారు వెనుక భాగంలో కూర్చున్న బి.వి.ఎస్. కృష్ణ పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నట్టు యలమంచిలి రూరల్ ఎస్ఐ పైల సింహాచలం తెలిపారు. ప్రమాదానికి కారణమైన ట్యాంకర్ కారు డ్రైవర్లు బేతపూడి రాము,కొండగొర్రి మల్లు దొర కుమార్‌లపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీలో వెంకట శివకుమార్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించామని ఆయన చెప్పారు.ఆస్పత్రి మార్చురీ వద్ద మృతుని కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు.

సూర్యప్రభ వాహనంపై అప్పన్న తిరువీధి



సూర్యప్రభ వాహనంపై అప్పన్న

సింహాచలం: సింహగిరిపై నిర్వహిస్తున్న సుదర్శన నారసింహ మహా యజ్ఞంలో భాగంగా శుక్రవారం సాయంత్రం స్వామికి సూర్యప్రభ వాహనంపై తిరువీధి నిర్వహించారు. స్వామివారి ఉత్సమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవిలను ముస్తాబు చేసి సూర్యప్రభ వాహనంపై అధిష్టంపజేసి సాయంత్రం సింహగిరి మాడ వీధుల్లో తిరువీధిని వైభవంగా నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని పులకించిపోయారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళల కోలాటం ప్రదర్శన ఆకట్టుకుంది. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధాన అర్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, అర్చకులు, రుత్వికులు, పారాయణదారులుపాల్గొన్నారు.